
సాక్షి ఒడిశా

బుధవారం । 24 । జులై । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2.75.396లు,బంగారం 550 మిల్లీగ్రాములు,వెండి 23 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రాష్ట్రానికి మొండిచేయి చూపారు

ఎన్నికల సమయంలో బీజేపీ నేతలు రాష్ట్రానికి ఎన్నో పెద్ద హామీలు ఇచ్చి, బడ్జెటు కేటాయింపుల్లో మొండి చేయి చూపారని ప్రతిపక్ష నేత, మాజీ సీఎం నవీన్ పట్నాయక్ విమర్శించారు.

- IIలో▸



బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

బడ్జెట్‌లో పోలవరంపై కేంద్ర ప్రభుత్వ వైఖరి వలన ఒడిశా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది.

- IIలో▸

న్యూస్‌రీల్

డిప్యూటీ స్పీకర్ పదవికి నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న భవానీ శంకర్ భోయ్

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియ మంగళవారం ఆరంభమైంది. అధికార పక్షం భారతీయ జనతా పార్టీ తాలా సొరా నియోజకవర్గం ఎమ్మెల్యే భవానీ శంకర్ భోయ్ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించింది. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా మరియు మంత్రిమండలి సభ్యులు, ఎమ్మెల్యేల సమక్షంలో భవానీ శంకర్ డిప్యూటీ స్పీకర్ పదవికి నామినేషన్ పత్రాలను సమర్పించారు.

బాధ్యతల స్వీకరణ



భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ మండలం అదనపు మండల రైల్వే మేనేజర్ (ఆపరేషన్)గా ప్రదీప్ కుమార్ బెహెరా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 1998 బ్యాచ్ భారతీయ రైల్వే విద్యుత్ ఇంజినీరింగ్ సేవా రంగం (ఐఆర్ఎస్ఈఈ) అభ్యర్థి. ఇంతకుముందు తూర్పు కోస్తా రైల్వే ప్రధాన కార్యాలయంలో చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (నిర్మాణం)గా బాధ్యతలు నిర్వహించారు. రౌర్కెలా ఎన్ఐటీలో బీటెక్ కోర్సులో ఉత్తీర్ణత సాధించారు. ఖుర్దారోడ్ మండలంలో సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ వంటి పలు ఉన్నత హోదాల్లో పని చేశారు.

నేడు శ్రీముఖ సింగారం



మాస్క్‌తో ఉన్నటువంటి శ్రీముఖం

భువనేశ్వర్: శ్రావణ మాస కృష్ణపక్ష తృతీయ తిథి పురస్కరించుకుని శ్రీముఖ సింగారం సేవ నిర్వహిస్తారు. దీనిని బొనాకా లగ్గి అని వ్యవహరిస్తారు. బుధవారం ద్వితీయ భోగ మండపం సేవ తర్వాత శ్రీముఖ సింగారం ప్రారంభం అవుతుంది. అలంకారం ముగిసేంత వరకు భక్తులకు దర్శనం తాత్కాలికంగా నిలిపివేస్తారు. దీనిలో భాగంగా సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు దర్శనం నిలిపివేయబడుతుందని శ్రీమందిరం అధికార వర్గాలు తెలిపాయి.

భారీ కోబ్రా కలకలం



పట్టుబడిన కింగ్ కోబ్రా

కొరాపుట్: గత 15 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు పెరిగాయి. నిర్మానుష్య ప్రాంతాలు జలమయ మవ్వడంతో భారీ సర్పాలు జనావాసాల్లోకి వస్తున్నాయి. మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ఇచ్చాబతిగుడలో భారీ కోబ్రా కలకలం సృష్టించింది. దీంతో పట్టణానికి చెందిన స్నేక్ హెల్ప్‌లైన్‌కి చెందిన శుభాష్ సామంత్రాయ్, సాయి కుమార్‌లను స్థానికులు సంప్రదించారు. అప్పటికే పాము ఒక ఇంటిలోకి వెళ్లింది. ఆ కుటుంబ సభ్యులు భయంతో కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. హెల్ప్ లైన్ సభ్యులు వచ్చి పామును సురక్షితంగా బంధించి, సమీప అడవిలో విడిచిపెట్టారు.

బడ్జెట్‌పై బీజేపీ ఎంపీలకు మౌనమెందుకు

- కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా



కొరాపుట్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఒడిశాకి చెందిన బీజేపీ ఎంపీలు మౌనం వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్కా విమర్శించారు. మంగళవారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 21 ఎంపీలకు బీజేపీకే 20 మంది ఎంపీలు ఉన్నారన్నారు. కానీ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి సుమారు రూ.70 వేల కోట్లకు పైగా కేటాయించారని, బీహార్‌కి కూడా భారీగా కేటాయింపులు ఉన్నాయన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వానికి ప్రధాన మద్దతుగా ఉన్న ఒడిశాకి మాత్రం ఎటువంటి కేటాయింపులు లేవని దుయ్యబట్టారు. ఇటువంటి పరిస్థితిలోనూ ఎంపీలు ఏమీ మాట్లాడకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు.

ఆరోగ్య కేంద్రానికి.. అనారోగ్యం

- సక్రమంగా విధులకు హాజరవ్వని వైద్యుడు
- సిబ్బందిదీ అదేతీరు
- సకాలంలో రోగులకు అందని వైద్యం



జంగిలి పీహెచ్‌సీ

రాయగడ: వర్షాకాలం వస్తుందంటే ఆ గ్రామ ప్రజలకు కంటి మీద కునుకు ఉండదు. ఏ క్షణంలో ఎవరికి అతిసారం సోకుతుందో.. ఎవరిని మలేరియా పట్టిపీడిస్తుందోనని ఒకటే భయం. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా ఆ గ్రామంలో ఉన్న పీహెచ్‌సీ దుస్థితి తయారైంది. గ్రామంలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఉన్నప్పటికీ వైద్యుడు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో ఇటీవల వ్యాప్తి చెందుతున్న మలేరియా, డెంగీ జ్వరాలు, అతిసారం కేసులు వీరిని మరింత కలవరపెడుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. సదరు సమితి పరిధి జంగిలి గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన వైద్యుడు విధులకు సరిగ్గా హాజరవ్వడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ వచ్చినా కొద్దిసేపే ఉండి తిరిగి వెళ్లిపోతుంటారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ సిబ్బందిది కూడా ఇదే తంతు అని చెబుతున్నారు. సుమారు 6 పంచాయతీలకు చెందిన 60కు పైబడిన గ్రామాల ప్రజలు ఏచిన్న అనారోగ్యం వచ్చినా ఈ పీహెచ్‌సీపైనే ఆధారపడుతుంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఇక్కడ సమయానికి వైద్య సేవలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు రోగిని తీసుకొస్తే నిరాశతోనే వెనుతిరగాల్సిన దుస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు. ఎక్కువ రోజులు తాళంవేసి కనిపించే ఈ ఆరోగ్య కేంద్రంపై భరోసా పోయిందని చెబుతున్నారు.

శిథిలావస్థలో క్వార్టర్స్

పీహెచ్‌సీలో విధులు నిర్వహించే వైద్యుడితో పాటు అతని సహాయకుడి కోసం రాష్ట్ర ప్రభుత్వం పీహెచ్‌సీ సమీపంలోనే కార్టర్స్‌ను ఏర్పాటు చేసింది. అయితే వైద్యుడు గానీ, సిబ్బంది గానీ ఎవ్వరూ అక్కడ ఉండకపోవడంతో నిరపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతంలో సెల్‌ఫోన్ నెట్‌వర్క్ లేకపోవడంతో ఏ డాక్టరు వచ్చినా ఉండటం లేదని గ్రామస్తులు అంటున్నారు. జిల్లా కేంద్రంలో ఉంటూ ఎప్పుడో తనకు నచ్చిన సమయంలలో వచ్చి సేవలు అందిస్తుంటారని పేర్కొంటున్నారు.



ఖాళీగా దర్శనమిస్తున్న ప్రధాన వైద్యుడి సీటు



శిథిలావస్థకు చేరిన వైద్యుడి క్వార్టర్స్

పేరుకే పీహెచ్‌సీ



పేరుకే ఇక్కడ పీహెచ్‌సీ ఉంది. ఎప్పుడూ డాక్టర్ వచ్చి సేవలందించిన దాఖలాలు లేవు. ఏదైనా అత్యవసర పరిస్థితిలో గత్యంతరం లేక రోగులు జిల్లా కేంద్రాస్పత్రికి వెళ్తుంటారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోతోంది. అసలే వర్షాకాలం కావడంతో సీజనల్ రోగాలు పట్టి పీడిస్తున్నాయి. గత్యంతరం లేక రోగులు పీహెచ్‌సీ వద్ద గంటల తరబడి డాక్టర్ కోసం నిరీక్షించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

– శ్రీకాంత్ పండ, జంగిలి గ్రామస్తుడు

అప్పుడప్పుడు డాక్టర్ దర్శనం



వారానికి ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే డాక్టర్ దర్శనం లభిస్తుంది. అది కూడా వచ్చిన రెండు గంటల్లో తిరిగి తాళం వేసి వెళ్లిపోతుంటారు. రోగులు చికిత్స కోసం వచ్చి నిరాశతో వెనుదిరుగుతుంటారు. అత్యవసర పరిస్థితిలో జిల్లా కేంద్రాస్పత్రికి వెళ్తుంటారు. ఉన్నా ఫలితం లేని ఇటువంటి వైద్య కేంద్రంలో విధులు నిర్వహించే వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. నిత్యం ప్రజలకు వైద్య సేవలు అందేలా చూడాలి.

– నందు జిలకర, జంగిలి గ్రామస్తుడు

దర్యాప్తు చేస్తాం

జంగిలి పీహెచ్‌సీలో వైద్యుడి సేవలు మృగ్యమైన విషయం నా దృష్టికి వచ్చింది. ఇదివరకు ఒకసారి ఆ పీహెచ్‌సీని సందర్శించాను. అన్ని వసతులు ఉన్నాయి. సేవలు సకాలంలో అందుతున్నాయని భావించాం. వచ్చిన ఫిర్యాదుల మేరకు దర్యాప్తు చేపడతాం. అన్నివేళలా వైద్య సేవలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, జిల్లా ముఖ్యవైద్యాధికారి

సభలో గందరగోళం



రాష్ట్ర శాసనసభ

- గవర్నర్ కుమారుడి అంశంపై అట్టుడుకుతున్న అసెంబ్లీ
- సభలో బీజేడీ ఎమ్మెల్యేల విమర్శల దాడి
- రెండోరోజు రెండుసార్లు వాయిదా

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ బడ్జెటు సమావేశాలు పురస్కరించుకొని అధికార, విపక్షాల మధ్య వాగ్వాదాలతో సభా ప్రాంగణం హోరెత్తుతోంది. ఇరుపక్షాల మధ్య వాడీవేడి ఆరోపణలతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో మంగళవారం సభా కార్యకలాపాలను స్పీకర్ వరుసగా 2 సార్లు వాయిదా వేశారు. ఈ క్రమంలో సభలో ప్రశ్నోత్తరాలకు గండి పడింది.

గవర్నర్ కుమారుడిపై చర్యలకు పట్టు

పూరీలోని రాజ్‌భవన్‌లో విధులు నిర్వహిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్‌ఓ)పై దాడికి పాల్పడిన గవర్నర్ రఘుబర్ దాస్ కుమారుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీ బిజూ జనతా దళ్ (బీజేడీ) సభ్యులు పట్టుబడుతున్నారు. దీంతో సభలో కార్యకలాపాలకు వరుసగా రెండోరోజు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అధికార భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సభ్యులతో బీజేడీ సభ్యులకు వాగ్వాదానికి దారితీసిన నేపథ్యంలో సభలో గందరగోళం నెలకొంది. ఈ పరిస్థితుల్లో స్పీకర్ సురమా పాఢి సభను మంగళవారం ఉదయం తొలుత 11.30 గంటల వరకు, తదుపరి సాయంత్రం 4 గంటలకు సభా కార్యకలాపాలను నిరవధికంగా వాయిదా వేసినట్లు ప్రకటించారు.

అధికారికి న్యాయం జరగాలి

ఈనెల 7వ తేదీన ప్రభుత్వ అధికారి (ఏఎస్‌ఓ)పై జరిగిన దాడికి న్యాయం జరగాలని బీజేడీ సీనియర్ నాయకురాలు ప్రమీలా మల్లిక్ డిమాండ్ చేశారు. గవర్నర్ కుమారుడు దాడి చేయగా ఇంత వరకు న్యాయం జరగలేదని ఆరోపించారు. బాధిత ప్రభుత్వ అధికారికి న్యాయం చేయక పోగా, పైపెచ్చు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారని మండిపడ్డారు. ఒడియా ఆత్మ గౌరవం నినాదంతో బీజేపీ అధికారంలోకి వచ్చి, గద్దెనెక్కిన మరుక్షణమే ఈ విషయాన్ని విస్మరించింది అనేందుకు ఈ దాడి వృత్తాంతమే నిలువెత్తు తార్కాణమని ధ్వజమెత్తారు. ఒడియా ప్రజలకు భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. ఈ అంశంపై దర్యాప్తు చేస్తున్న పూరీ కలెక్టర్ నివేదిక ఇచ్చేవరకు వేచి చూడాలని న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ప్రకటనలు చేస్తూ ప్రతిపక్షాలను నొక్కిపెట్టేందుకు విఫలయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

సమయాన్ని వృథా చేస్తున్నారు

మరోవైపు కాంగ్రెస్ నాయకుడు తారాప్రసాద్ బాహిణీపతి ఉభయ అధికార, విపక్షాల తీరుపై విరుచుకుపడ్డారు. బీజేపీ, బీజేడీలు నిరుద్యోగం వంటి కీలకమైన సమస్యలపై చర్చకు ప్రాధాన్యత కల్పించకుండా, అభ్యంతరకర శైలిలో సభా సమయాన్ని వృథా చేస్తున్నారని ఆరోపించారు. ఈ రెండు పక్షాల ధోరణితో సభా కార్యకలాపాలు వరుసగా 2 సార్లు వాయిదా పడ్డాయన్నారు. బడ్జెటు సమావేశాలు ఆరంభం పురస్కరించుకుని గవర్నర్ రఘుబర్ దాస్ సభలో ప్రసంగించడం ప్రారంభించిన మరుక్షణం నుంచి విపక్షాలు వాకౌట్ చేయడంతో బడ్జెట్ సమావేశాల తొలిరోజు సోమవారం నుంచి సభలో వాతావరణం వాడివేడిగా కొనసాగుతోంది. ఏఎస్‌ఓపై దాడికి పాల్పడిన గవర్నర్ దాస్ కుమారుడు లలిత్ కుమార్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంపై ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేడీలు సభని బహిష్కరించి బయటకు వెళ్లాయి. ఇటీవల ముగిసిన రథయాత్ర సందర్భంగా పూరీలోని రాజ్‌భవన్‌కు ఇన్‌చార్జిగా ఉన్న ఏఎస్‌వో బైకుంఠ ప్రధాన్‌పై దాడి చేసినందుకు గవర్నర్ కుమారుడిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

తెలుగు విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



తెలుగు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

రాయగడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న తెలుగు విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తెలుగు మాధ్యమం పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో స్పందించిన స్థానిక ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ సభ్యులు గాంధీనగర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని తెలుగు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను మంగళవారం అందజేశారు. ఒడిశాలో చదువుకునే తెలుగు విద్యార్థులకు గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు పాఠ్య పుస్తకాల పంపిణీ విషయంలో పక్షపాత వైఖరి అవలంబిస్తున్నాయని క్లబ్ అధ్యక్షుడు లాడి చంద్ర శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై పట్టణంలోని తెలుగు విద్యార్థులకు అండగా ఉంటామని తెలియజేశారు. పాఠశాలలో తెలుగు మీడియం చదువుతున్న 80 మంది విద్యార్థులకు క్లబ్ పుస్తకాలను ఉచితంగా అందించారు. హెచ్‌ఎం ప్రతాప్ చంద్ర భత్రియ, తెలుగు ఉపాధ్యాయుడు సత్యానారాయణలు క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

అంతిమ యాత్రకు అవస్థలు



నీటిలో నడుచుకుంటూ మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్తున్న గ్రామస్తులు

జయపురం: శ్మశానానికి వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో అష్టకష్టాలు పడుతున్న సంఘటనలు తరుచూ చోటుచేసుకుంటూనే ఉన్నాయి. బతికినన్నాళ్లు ఎలాగో బాధలు పడ్డాం, చచ్చేటప్పుడైనా సుఖం లేకుండా పోతోందని జయపురం సమితి చలానగుడ గ్రామ ప్రజలు వాపోతున్నారు. గ్రామానికి చెందిన సాను కంతలేల్ అనే వృద్ధుడు సోమవారం సాయంత్రం మృతి చెందాడు. దీంతో మంగళవారం ఉదయం శ్మశానానికి తీసుకెళ్లడానికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సిద్ధమయ్యారు. ఆ ఊరు నుంచి శ్మశానానికి వెళ్లాలంటే కాలువ దాటాల్సిన పరిస్థితి ఉంది. అయితే ప్రస్తుతం వర్షాలు వలన కాలువలో నీరు పెరగడంతో పారుతున్న మోకాలు లోతు నీటిలో మృతదేహాన్ని అతికష్టంపై శ్మశానానికి తీసుకెళ్లారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

ఒకే గది.. ఐదు తరగతులు





పైన కనిపిస్తున్న ఫొటోలను గమనించారా మొదటి ఫొటోలో ఉపాధ్యాయుడు బ్లాక్ బోర్డువైపు తిరిగి ఉంటే, కొంతమంది పిల్లలు అతనివైపు కనీసం చూడడం లేదని అనిపిస్తోంది కదూ. అలా అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్లే. ఎందుకంటే అక్కడ ఒకే తరగతి గదిలో 5 తరగతుల విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ఒక తరగతి విద్యార్థులకు ఒకవైపు తిరిగి ఉపాధ్యాయుడు పాఠం చెబుతుండగా, మరోవైపు తిరిగి ఉన్న విద్యార్థులకు మరో టీచర్ పాఠాలు చెబుతున్నారు. మిగతా పిల్లలకు చదువులు సాగక కాలక్షేపం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రెండో ఫొటోలో ఒకటే తరగతి ఉండడంతో ఆరుబయట విద్యార్థులకు ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నారు. కొరాపుట్ జిల్లా జయపురం సబ్ డివిజన్ కుంద్ర సమితి అసన గ్రామ పంచాయతీ కుంభికారీ గ్రామం, బాఘ్డెరి పంచాయతీ బుధాగుడ గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది. దీంతో తమ పిల్లలు విద్యకు దూరమవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– జయపురం

సాయిరాం రెస్టారెంట్‌లో చోరీ



దొంగతనం జరిగిన రెస్టారెంట్

రాయగడ: స్థానిక న్యూకాలనీ సమీపంలోని సాయిరాం రెస్టారెంట్‌లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు రెస్టారెంట్ వెనుకనున్న గోడకు అమర్చిన ఫాగ్ ఎగ్జాస్టర్ ఫ్యాన్‌ను తొలగించి ఆ రంధ్రం నుంచి లోపలికి ప్రవేశించారు. అనంతరం విద్యుత్ సరఫరా నిలిపివేశారు. రెస్టారెంట్ కౌంటర్‌లో ఉన్న రూ.3 లక్షలకు పైబడిన నగదును దొంగిలించినట్లు రెస్టారెంట్ యజమాని ఎం.శ్రీనివాస్‌రావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఎప్పటిలాగే ఆదివారం రాత్రి 12 గంటలకు రెస్టారెంట్‌ను మూసి ఇళ్లకు అందరూ వెళ్లిపోయారు. అనంతరం సోమవారం ఉదయం యజమాని రెస్టారెంట్‌కు వచ్చేసరికి వెనుక గోడ తవ్వి ఉండడం గమనించి దొంగతనం జరిగినట్లు అనుమానించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ప్రతిరోజూ రెస్టారెంట్‌లో జరిగే వ్యాపారానికి సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా సామాన్లు ఖరీదు చేసే వారికి చెల్లిస్తుంటానన్నారు. అయితే గత రెండు రోజులుగా ఆన్‌లైన్ పేమెంట్లు చేయడం కుదరక వ్యాపారం కింద వచ్చే సుమారు రూ.3 లక్షలకు పైబడిన నగదును కౌంటర్‌లో ఉంచి వెళ్లానని తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.



రెస్టారెంట్ వెనుక గోడను తవ్విన దుండగులు

మరో చిన్నారి మృత్యువాత



మృతి చెందిన సుమిత్ర

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి దొంగాశిలి పంచాయతీ మునిషిపాదొరా గ్రామంలో మరో చిన్నారి డిఫ్తీరియా లక్షణాలతో మృత్యువాత పడింది. కాగా కొద్దిరోజుల క్రితం ఇదే గ్రామంలో డిఫ్తీరియా బారినపడి 5 మంది చిన్నారులు మరణించిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా వైద్యశాఖ అధికారులు గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో వ్యాధి నివారణ చర్యలను చేపట్టారు. దీనిలో భాగంగా గ్రామాల్లో చిన్నారులకు టీకాలను వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీంతో వ్యాధి అదుపులోకి వచ్చిందని ఊపిరిపీల్చుకుంటున్న సమయంలో, తాజాగా అదే గ్రామానికి చెందిన సుమిత్రా అనే మూడేళ్ల చిన్నారి మృతి చెందడంతో ఆందోళన వ్యక్తం చేసిన వైద్యశాఖ సుమిత్రకు వివిధ పరీక్షలను నిర్వహించింది. అయితే చిన్నారి డిఫ్తీరియాతో మృతి చెందలేదని, సెప్టిసేమియా వ్యాధి సోకడంతో మృతి చెందిందని జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్ స్పష్టం చేశారు.

ఇదీ విషయం...

మునిషిపాదొరా గ్రామంలో నివాసముంటున్న చిన్నారి సుమిత్ర శుక్రవారం అస్వస్థతకు గురవ్వడంతో కుటుంబ సభ్యులు కొరాపుట్‌లోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఆరోగ్యం కాస్త కుదుటపడడంతో అక్కడి నుంచి స్వగ్రామానికి తిరిగి వచ్చారు. అయితే ఆదివారం రాత్రి సుమిత్ర మళ్లీ జ్వరం బారినపడడంతో సోమవారం ఉదయం స్థానిక జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. చికిత్సావస్థలో సోమవారం మధ్యాహ్నం సుమిత్ర మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. ఏది ఏమైనప్పటికీ కాసీపూర్‌లో ఇటువంటి తరహా వ్యాధుల బారినపడిన చిన్నారులు మృత్యువాత పడుతుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

యువతి మృతదేహం లభ్యం


మనీష(ఫైల్)

జయపురం: బొయిపరిగుడ సమితి జి.మఖిగుడ పంచాయతీ కథంగుడ గ్రామానికి చెందిన సునీల్ బారిక్ కుమార్తె మనీష బారిక్ (22) ఈనెల 8వ తేదీ నుంచి కనిపించలేదు. అప్పటి నుంచి ఆమె తల్లిదండ్రులు అన్ని ప్రాంతాల్లో గాలించారు. అనంతరం ఈనెల 13వ తేదీన బొయిపరిగుడ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రేమ వ్యవహారమై ఉంటుందని పలువురిని విచారించారు. అయితే మనీష ఇంటి వెనుకనున్న కొండపైకి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మంగళవారం వెదురు కర్రలు సేకరించేందుకు వెళ్లగా, అక్కడ యువతి మృతదేహం కనిపించింది. దీంతో గ్రామస్తులకు తెలియజేయగా మనీషదిగా గుర్తించారు. ఈ విషయం బొయిపరిగుడ పోలీసులకు తెలియజేయగా వచ్చి పరిశీలించారు. ఒక చెట్టుకు మనీష దుస్తులు కట్టి ఉండడం గమనించారు. అయితే ఆమె శరీరం నుంచి తలవేరై నేలపై పడి ఉండడంతో ఎవరో హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించింది. మృతదేహానికి పోస్టుమార్టం జరిపిన తర్వాత ఎలా చనిపోయింది అనే విషయం తెలిసే అవకాశం ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి.

సీఈవోగా సంతాన గోపాలన్


సంతాన గోపాలన్

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో)గా సీనియర్ ఒడిశా కేడర్ ఐఏఎస్ అధికారి ఆర్.సంతాన గోపాలన్ నియమితులయ్యారు. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఒడిశా సీఈఓగా నికుంజ బిహారీ ధొలా స్థానంలో సంతాన గోపాలన్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపిన భారత ఎన్నికల సంఘం ఈ నియామకం ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొంది. అతను బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ఉత్తర్వులు అమలతాయని వెల్లడించింది. ఆయన తక్షణమే బాధ్యతలు స్వీకరించేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని ఎన్నికల సంఘం ఆదేశించింది.

బాధిత కుటుంబానికి పరామర్శ


పల్లుగని కుటుంబాన్ని పరామర్శిస్తున్న రమేష్ మజ్జి తదితరులు

కొరాపుట్: వర్షాలు వలన మృతి చెందిన వ్యక్తి కుటుంబాన్ని నబరంగ్‌పూర్ జిల్లా బీజేడీ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి మంగళవారం పరామర్శించారు. నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి బటియాగుడ గ్రామానికి చెందిన పల్లుగని బాగ్ ఇంటి గోడ ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. ఈ గోడ కింద ఉండిపోయి పల్లుగని చనిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న రమేష్ తన అనుచరులతో వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు.

బీజేడీ రాజ్యసభ సభ్యుల వాకౌట్

భువనేశ్వర్: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో బిజూ జనతా దళ్ రాజ్యసభ సభ్యులు మంగళవారం వాకౌట్ చేశారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా బడ్జెట్‌లో ఒడిశాకు ప్రత్యేక హోదా ఇవ్వకుండా చేశారని ఆరోపిస్తూ ఎంపీలు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై తమ పార్టీకి ఉన్న అసంతృప్తిని ఎత్తిచూపుతూ నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు. బడ్జెట్‌లో ఒడిశాను నిర్లక్ష్యం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ బడ్జెట్‌ను ఒడిశా వ్యతిరేక బడ్జెటుగా రాజ్యసభ సభ్యుడు, బీజేడీ అధికార ప్రతినిధి డాక్టర్ సస్మిత్ పాత్రో వ్యాఖ్యానించారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, బీహార్‌లు ప్రత్యేక కేటగిరీ కోసం అడుగుతుండగా, ఒడిశా మినహా మిగిలిన రెండు రాష్ట్రాలు ప్రత్యేక అదనపు నిధులు పొందాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. ఒడిశా అభివృద్ధికి తమ ప్రభుత్వం సాయం చేస్తుందని ప్రకటించారు.

'క్వారీల నిర్వహణకు అనుమతులు ఇవ్వాలి'

టెక్కలి: జిల్లాలో గ్రానైట్ క్వారీల నిర్వహణ, పర్మిట్‌ల మంజూరుకు అనుమతులు ఇవ్వాలని ఉత్తరాంధ్ర గ్రానైట్ అసోసియేషన్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ చింతాడ గణపతి మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతంలో ఎన్నడూ లేని విధంగా క్వారీ నిర్వహణ, పర్మిట్‌లకు అనుమతుల విషయంలో ఆంక్షలు విధించడంతో ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా క్వారీల నిర్వహణ నిలిచిపోయిందన్నారు. దీని వల్ల గ్రానైట్ క్వారీలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వేలాది మంది కార్మికులు, వందలాది మంది వివిధ విభాగాల టెక్నీషియన్స్ రోడ్డున పడే దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 50 రోజులుగా ఇదే పరిస్థితి చోటు చేసుకుందని పేర్కొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

మల్కన్‌గిరి:

జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలను దక్షిణ విభాగానికి చెందిన రెవెన్యూ డివిజనల్ కమిషనర్ ఆర్.ఎస్.గోపాలాన్ మంగళవారం పరిశీలించారు. ముందుగా స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో వర్షాల సమయంలో తీసుకున్న చర్యలపై కలెక్టర్ సచిన్ పవార్‌తో కలిసి చర్చించారు. ఆస్తినష్టం వాటిల్లినవారికి పరిహారం కోసం వివరాలు సేకరించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు.

హైవేపై వరద ప్రవాహం

భువనేశ్వర్: తెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో 55వ నంబరు జాతీయ రహదారి నదిలా మారింది. ఢెంకనాల్ మెరామండలి సమీపంలోని జాతీయ రహదారిపై రెండు అడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తోంది. దీంతో కటక్, సంబల్‌పూర్ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మరో వైపు రాష్ట్రంలో 15 జిల్లాల్లో లోటు వర్షపాతం కొనసాగుతోందని స్థానిక వాతావరణ శాఖ కేంద్రం తెలిపింది.

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ 96 గ్రామం వద్ద సోమవారం వరద నీటిలో లారీ చిక్కుకుంది. ఆ గ్రామంలోని రహదారిపై ఏర్పడిన గోతిలో లారీ దిగబడిపోవడంతో చక్రాలు లారీ నుంచి వేరయ్యాయి. అయితే డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


మల్కన్‌గిరి: గోతిలో పడిన లారీ


భువనేశ్వర్: జాతీయ రహదారిపై వరద ప్రవాహానికి ఎదురీదుతున్న ట్రక్కు


భువనేశ్వర్: జాతీయ రహదారిపై వరద నీటిలో చిక్కుకున్న బైక్


మల్కన్‌గిరి: పొట్టేరు వంతెన పరిశీలిస్తున్న అధికారులు


మల్కన్‌గిరి: కంగుర్‌కొండ వంతెన వద్ద గోపాలన్ తదితరులు

మాజీ సీఎం నవీన్‌ను అరెస్టు చేయాలి

- శాసనసభ వ్యవహారాల మంత్రి ముఖేష్ డిమాండ్


డాక్టర్ ముఖేష్ మహాలింగ్

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభ ప్రతిపక్ష నేత, మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌ను అరెస్ట్ చేయాలని రాష్ట్ర వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ మంగళవారం డిమాండ్ చేశారు. సమావేశాల సమయంలో సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం నేరంగా పేర్కొన్నారు. ప్రధానంగా సభలో గవర్నర్ ప్రసంగంపై వ్యతిరేకత ప్రదర్శించడం నిబంధనల ఉల్లంఘనకు నిదర్శనంగా పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగానికి ఆటంకం కలిగించారని అరెస్ట్ చేయాలని కోరారు. కాగా ముఖేష్ మహాలింగ్ ఆరోపణపై బీజేడీ నాయకుడు ప్రతాప్ కేశరి దేవ్ ఘాటుగా స్పందించారు. మంత్రికి ధన్యవాదాలు తెలియజేయాల్సిందేనన్నారు. ఒడిశా ఆత్మ గౌరవాన్ని కాపాడినందుకు మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌ను అరెస్టు చేయాల్సిందేనని ఎద్దేవా చేశారు. ముందు విధి నిర్వహణలో ఉన్న రాజ్‌భవన్ సిబ్బంది ప్రభుత్వ అధికారిపై దాడికి పాల్పడిన గవర్నర్ కుమారుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.


బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

- జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

కొరాపుట్: బడ్జెట్‌లో పోలవరంపై కేంద్ర ప్రభుత్వ వైఖరి వలన ఒడిశా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. మంగళవారం రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని అసెంబ్లీ ఆవరణలో ఆ పార్టీకి చెందిన జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి మీడియాతో మాట్లాడారు. పోలవరం నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదన్నారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా పోలవరం ఎత్తు పెంచడం వలన మల్కన్‌గిరి జిల్లాలో సుమారు 50 గ్రామాలు ముంపునకు గురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కరించకుండా కేంద్రం పోలవరం నిర్మాణం కోసం ఆంధ్రాకి నిధులు కేటాయింపులు చేసిందని మండిపడ్డారు. పోలవరంకి నిధులు ఇచ్చి ఒడిశా ప్రజలను నీటిలో ముంచుతున్నారని ధ్వజమెత్తారు.

రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకులు

రాయగడ: స్థానిక బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్నటువంటి మండపంలో రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు పుట్టినరోజు సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు, అభిమానులు రక్తదాన శిబిరం మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ అధికారి డాక్టర్ గౌతం పట్నాయక్ పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన నెక్కంటి మాట్లాడుతూ రక్తదానం మహాదానమని కొనియాడారు. రక్తదానంపై అపోహలు వీడి, స్వచ్ఛందంగా యువత ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. శిబిరంలో మొత్తం 116 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. అనంతరం జిల్లా కేంద్ర ఆస్పత్రి, అనాథ బాలికలు, వృద్ధాశ్రమంలో పండ్లు ,రొట్టెలు పంపిణీ చేశారు.

● వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ


పాతపట్నం ప్రధాన రోడ్డులో ముర్రాటలతో మహిళలు



పాతపట్నం: పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు మహిళలు భారీగా తరలిరావడంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. పలు వీధుల్లో ఆషాఢమాస ఆవేటి వారాల పండుగను నిర్వహించారు. మహిళలు ఘటాలను తీసుకుని ఊరేగింపుగా జూబ్లీహిల్స్ రోడ్డు నుంచి కిమిడి, కళింగ రోడ్డు మీదుగా నీలమణి దుర్గ అమ్మవారి ఆలయం వరకూ మేళాతాళాలు, డప్పులు వాయిద్యాలతో వెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేషధారణలు అందరినీ అలరించాయి.

'వారోత్సవాలు విజయవంతం చేయాలి'

మల్కన్‌గిరి: ఈనెల 28వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు జరగనున్న అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను విజయవంతం చేయాలని మావోయిస్టులు కోరారు. ఈ మేరకు ఆంధ్ర–ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ పేరుతో మంగళవారం ఒక లేఖ విడుదల చేశారు. పాలక వర్గాలు ప్రజలపై కొనసాగిస్తున్న విప్లవ ప్రతీ ఘాతుక ఆపరేషన్ కగార్‌ను ప్రజాయుద్ధంతో ఓడిద్దామని పిలుపునిచ్చారు.

యువత స్పందించారు


ముక్తాపురం పాఠశాల రహదారిని బాగు చేస్తున్న యువకులు

మెళియాపుట్టి: మండలంలోని ముక్తాపురం గ్రామంలోని గుడి, బడికి వెళ్లే రహదారి నీటి నిల్వ, చెత్తతో నిండి విద్యార్థులు, గ్రామ ప్రజలు వెళ్లడానికి ఇబ్బంది పడ్డారు. దీనిపై సాక్షిలో మంగళవారం 'వాననీటి నిల్వతో ఇబ్బంది' శీర్షికన ప్రచురితమైన కథనానికి గ్రామానికి చెందిన యువత స్పందించారు. శ్రమదానం చేసి మంగళవారం పాఠశాలకు వెళ్లే రహదారిలో నిల్వ ఉన్న నీటిని, చెత్తను తొలగించారు. దీంతో విద్యార్థులకు రహదారి సమస్య పరిష్కారమైంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


పలాస సీహెచ్‌సీలో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ జీవీ రాజ్యలక్ష్మి

కాశీబుగ్గ: సీజనల్ వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని జ్వరాలకు, డయేరియా కేసులకు సంబంధించి పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ జీవీ రాజ్యలక్ష్మి అన్నారు. ఆమె మంగళవారం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని సందర్శించి ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తమ్మినాన పాపినాయుడును ఆదేశించారు. ఆస్పత్రిలో ఉన్న అన్ని వ్యాధులకు అందుతున్న చికిత్సలను పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రిలో వైద్యుల మధ్య సమన్వయం ఉండాలని, సీజనల్ వ్యాధులతో అనేక మంది వస్తారని వారికి సిబ్బంది, వైద్యులు వైద్య సేవలు అందించాలని కోరారు. ఆస్పత్రిలో మత్తు వైద్యుడు లేరని ఆమె దృష్టికి తీసుకెళ్లగా రోజుల వ్యవధిలో నియమించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

టెక్కలిలో..

టెక్కలి రూరల్: ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ టెక్కలి జిల్లా ఆస్పత్రిని మంగళవారం డీసీహెచ్ ఎస్.రాజ్యలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులకు, పాముకాటులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అన్నదానిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావుని అడిగి తెలుసుకున్నారు. అలాగే రోగులకు వైద్యం సకాలంలో అందేలా చూడాలని సూచించారు.

రాష్ట్రానికి మొండిచేయి చూపారు

- కేంద్ర బడ్జెట్‌లో ఒడిశాపై వివక్ష
- మాజీ సీఎం నవీన్ పట్నాయక్


మాట్లాడుతున్న విపక్ష నేత నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: ఎన్నికల సమయంలో బీజేపీ నేతలు రాష్ట్రానికి ఎన్నో పెద్ద హామీలు ఇచ్చి, బడ్జెటు కేటాయింపుల్లో మొండిచేయి చూపారని ప్రతిపక్ష నేత, మాజీ సీఎం నవీన్ పట్నాయక్ విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌పై రాజధానిలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఒడిశాపై కొనసాగుతున్న నిర్లక్ష్యానికి రాష్ట్ర ప్రజలతో పాటు, తాను కూడా నిరాశకు గురైనట్లు తెలిపారు. బీజేపీ తమ మ్యానిఫెస్టోలో ప్రత్యేక కేటగిరీ హోదాను ఒడిశా ప్రజలకు వాగ్దానం చేసిందని, అయితే ఈ హామీని పరిగణనలోకి తీసుకోనట్లు కనిపిస్తోందని దుయ్యబట్టారు. ఆంధ్రప్రదేశ్, బీహార్‌లకు ప్రత్యేక ప్యాకేజీలు, కోట్లాది నిధులు కేటాయించారన్నారు. కేంద్ర ప్రభుత్వం వద్ద కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బొగ్గు రాయల్టీని సవరించాలనే ఒడిశా డిమాండ్ తిరస్కరించారన్నారు. దీనివల్ల రాష్ట్రం ప్రతి సంవత్సరం వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం, లఘు, మధ్య, సూక్ష్మ వ్యాపార పరిశ్రమలపై ఇచ్చిన హామీలను విస్మరించారని పెదవి విరిచారు.

విపత్తు నిర్వహణ ప్యాకేజీ ఎక్కడ..?

ఒడిశా రాష్ట్రం ప్రతీ సంవత్సరం వరదలతో సహా అనేక ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తు చేశారు. దీనికోసం విపత్తు నిర్వహణకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరినా కేంద్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇతర రాష్ట్రాల నుంచి ఇదేవిధమైన అభ్యర్థనలు పరిగణనలోకి తీసుకొని, ఒడిశా అభ్యర్థనను పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి ప్రధాన సమస్యలపై ఈ బడ్జెట్‌లో గణనీయమైన చొరవ లేదన్నారు. పోలవరంపై ఒడిశా ఫిర్యాదులను పరిష్కరించకుండా పోలవరానికి ఎక్కువ నిధులు కేటాయించడం కేంద్ర ప్రభుత్వ పక్షపాత వైఖరిని తెలియజేస్తోందన్నారు. అయితే ఒడిశా పర్యాటకంపై దృష్టి పెట్టడం సంతోషకరమన్నారు. బడ్జెట్ పూర్తి వివరాలు బయటకు వచ్చే వరకు వేచి ఉంటామన్నారు.

ప్రభుత్వ చీఫ్ విప్ నియామకం

భువనేశ్వర్:

రాష్ట్ర శాసనసభ ప్రభుత్వ చీఫ్ విప్‌గా బౌధ్ నియోజకవర్గం ఎమ్మెల్యే సరోజ్ కుమార్ ప్రధాన్, రెముణా నియోజకవర్గం ఎమ్మెల్యే గోవింద చంద్ర దాస్ ప్రభుత్వ డిప్యూటీ చీఫ్ విప్‌గా నియమితులయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఆమోదం మేరకు ఈ నియామకాలు జరిగాయి.


సరోజ్ కుమార్ ప్రధాన్


గోవింద చంద్రదాస్

వీర జవాన్‌కు ఘనంగా నివాళులు


దండుగోపాలపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంతబొమ్మాళి: ఇటీవల కశ్మీరులో ఉగ్రవాదులతో పోరాడుతూ వీరమరణం పొందిన డొక్కరి రాజేష్‌కు దండుగోపాలపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు నివాళులర్పించారు. రాజేష్ ఇదే పాఠశాలలో చదువుకున్నాడు. పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పుష్పాంజలి ఘటించారు. రాజేష్ చిత్రపటం ముందు కొవ్వొత్తులు వెలిగించి అతని ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు నినాదాలు చేస్తూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై దృష్టి: ఎస్పీ


సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు, మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : ప్రతి రోజూ పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి గంజాయి, నాటుసారా, మద్యం అక్రమ రవాణా అరికట్టాలని, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే ప్రదేశాలను గుర్తించి ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో నెలవారీ సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జనాభా, భూనైసర్గిక స్వరూపం, సరిహద్దు ప్రాంతాలు, జాతీయ రహదారి, సముద్ర తీర ప్రాంతం, శాంతి భద్రతల సమస్యలు, నేరాల నమోదు, నేర ప్రవృత్తి, తీరు, సమస్యాత్మక గ్రామాలు, ట్రబుల్ మ్యాంగర్స్, స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వర్తించి ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలందించాలని, అర్జీదారులు ఇచ్చిన ఫిర్యాదు స్వీకరించిన వెంటనే వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు నేరం జరిగే ప్రదేశానికి వెళ్లి సమగ్ర విచారణ జరిపి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. నిత్యం నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా విజిబుల్ పోలీసింగ్‌లో వాహనాల తనిఖీలు నిర్వహించి గంజాయి అక్రమ రవాణా అరికట్టాలని, తరచూ గస్తీలు నిర్వహించాలన్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాలని, సమస్యలు తెలుసుకుని పరిష్కారం చూపాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు ప్రేమ్‌కాజల్, ఉమామహేశ్వరరావు, డీఎస్పీలు శృతి, బాలచంద్రారెడ్డి, నాగేశ్వరరెడ్డి, త్రినాథరావు, శ్రీనివాసరావు, ఏఓ గోపీనాథ్, సీసీ శివకుమార్, పీఆర్వో భాస్కర్ తదితరులున్నారు.

లంపీ స్కిన్ టీకాలు సద్వినియోగం చేసుకోవాలి


కంట్రగడ గ్రామంలో పశువులకు లంపీ స్కిన్ నిరోధక వ్యాక్సిన్లు వేస్తున్న పశు వైద్యాధికారులు

టెక్కలి: పశువులకు లంపీ స్కిన్ వ్యాధి సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అందజేస్తున్న వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ ఏడీ జి.రఘునాథరావు సూచించారు. మంగళవారం టెక్కలి మండలం కంట్రగడ గ్రామంలో పశువుకు లంపీ స్కిన్ నిరోధక వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఈ వ్యాధి వ్యాప్తి చెందుతున్న సమయంలో నిరోధక వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన నిర్వహించామని తెలిపారు. ప్రస్తుతం ఆగస్టు 18 వరకు పట్టణ, గ్రామాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏడీ రఘునాథరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి జనకచక్రవర్తి, ఎల్ఎస్ఏ రమణ, ఏహెచ్ఏ కొండలరావు, పాడి రైతులు లోకేశ్వర్రావు, అడవిరాజు, దేవకీనందన్, జగన్నాథం, కామేశ్వర్రావు, ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రామిక్ కాంగ్రెసుకు ఎస్సీ, ఎస్టీ సంఘం మద్దతు

భువనేశ్వర్:


మద్దతు ప్రకటించిన సంఘం నాయకులతో శ్రామిక్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి మహంతి

అవిభాజిత ఆగ్నేయ రైల్వే సిబ్బంది సహకార సంస్థ (అర్బన్ బ్యాంకు) ఎన్నికల వ్యూహం చివరి క్షణంలో మలుపులు తిరుగుతోంది. దాదాపు దశాబ్దం తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికల్లో పట్టు సాధించేందుకు ఉభయ శ్రామిక్ యూనియన్, శ్రామిక్ కాంగ్రెస్ హోరాహోరీగా తలపడుతున్నాయి. వాటాదారు ఓటరుని ఆకట్టుకునే క్రమంలో శ్రామిక్ కాంగ్రెసు అఖిల భారత షెడ్యూల్డు కులం, తెగల రైల్వే సిబ్బంది సంఘం మద్దతు కూడగట్టుకుంది. శ్రామిక్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు సమక్షంలో ఎస్సీ, ఎస్టీ సిబ్బంది సంఘం మండల కార్యదర్శి విజయ్ కుమార్ బెహెరా ఆధ్వర్యంలో ఇతర కార్యవర్గ సభ్యులు ఈ విషయాన్ని వెల్లడించినట్లు శాఖా కార్యదర్శి లక్ష్మీధర మహంతి తెలిపారు.

క్లుప్తంగా

కూలిపోయిన మిద్దె ఇల్లు

- ఇంట్లో నివసిస్తున్న 85ఏళ్ల వృద్ధురాలు
- తప్పిన పెను ప్రమాదం



కూలిపోయిన చిలకమ్మ మిద్దె ఇల్లు

తెర్లాం: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా తడిసిపోయిన ఓ మిద్దె ఇల్లు మంగళవారం తెల్లవారు జామున కూలిపోయింది. ఇల్లు కూలిపోయిన సమయంలో సుమారు 85ఏళ్ల వయస్సు గల వృద్ధురాలు ఇంట్లో ఉండడాన్ని గమనించిన స్థానికులు ఆమెను బయటకు తీసుకురావడంతో పెనుప్రమాదం తప్పింది. తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన కోటిపల్లి చిలకమ్మ నివాసం ఉండే మిద్దె ఇల్లు ఇటీవల కురిసిన వర్షాలకు బాగా తడిసిపోయింది. మంగళవారం తెల్లవారు జామున ఆమె ఇంట్లో ఉన్న సమయంలోనే ఇంటి ముందు భాగం కూలిపోయింది. ఏ ఆధారం లేని వృద్ధురాలి ఇల్లు వర్షాలకు కూలిపోవడంతో నివాసం ఉండడానికి ఆమెకు ఆధారం లేకుండా పోయిందని, అధికారులు ఆమెను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గోతిలో దిగబడిన లారీ

- ట్రాఫిక్‌జామ్‌తో ప్రయాణికుల ఇబ్బందులు



గోతిలో కూరుకుపోయిన లారీ

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామసమీపంలో పెద్దగోతిలో లారీ దిగబడిపోయింది. మంగళవారం కురిసిన చిన్నపాటి వర్షానికి బురదగా మారడంతో గొయ్యిని అంచనా వేయలేక లారీ డ్రైవర్ గోతిలోంచి వాహనాన్ని పోనివ్వడంతో అది అక్కడ కూరుకుపోయింది. దీంతో ట్రాఫిక్‌జామ్ కాగా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. బొబ్బిలి నుంచి తెర్లాం వైపు వెళ్లే, వచ్చే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గోతులను కంకర మట్టితో పూడ్చడంతో అందులో సుమారు 3 అడుగుల లోతున లారీ కూరుకుపోయింది.భారీ వాహనాలు ఇటువైపుగా రావడం,అవి ఇటువంటి ఇరుకైన ప్రదేశాలలో ఇరుక్కుపోవడం,ఇతర వాహనాలు అటుగా వెళ్లే పరిస్థితి లేకపోవడంతో అంతా ఇబ్బందులు పడుతున్నామని వాహనచోదకులు చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా తాత్కాలికంగా చేసే మరమ్మతులనైనా నాణ్యంగా చేయాలని లేకుంటే ప్రతిరోజు ఇటువంటి కష్టాలు తప్పవని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర హక్కుల కోసం ఉద్యమించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న వై.వెంకటేశ్వరరావు

విజయనగరం పూల్‌బాగ్: రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు కలిసి వచ్చే శక్తులతో ఉద్యమాలకు సిద్ధం కావాలని, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ నివేదిక ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కె. సురేష్, శంకర్రావు, జగన్‌మోహన్‌రావు, లక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీలో ప్రాంగణ ఎంపికలు

- తొలిబ్యాచ్ టూరిజం గ్రాడ్యుయేట్లకు శతశాతం ప్లేస్‌మెంట్స్



ప్రాంగణ ఎంపిక ఉత్తర్వులను అందజేస్తున్న వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలోని టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ విభాగం 2019–2024కి చెందిన ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ తొలి బ్యాచ్ గ్రాడ్యుయేట్లు టూరిజం మరియు హాస్పిటాలిటీ పరిశ్రమలో ఉద్యోగాలు సాధించారు. వర్సిటీలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో హైదరాబాద్‌లోని ప్రజ్వాయేజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో చిల్ల ఉదయ్ కుమార్, కె.వెంకట శ్రావణి, జీఏర్ హాలి హాలిడేస్ సంస్థలో బద్రీనారాయణ్, థామస్‌కుక్ లిమిటెడ్ సంస్థకు రెడ్డి భావని ఎంపికైనట్టు వీసీ ప్రొఫెసర్ కట్టిమణి మంగళవారం తెలిపారు. ఎంపికైన వారికి టూరిజం విభాగం డీన్ ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రాతో కలిసి వీసీ ఎంపిక ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఆర్‌టీలపై చిన్నచూపు



ఆందోళన చేస్తున్న సీఆర్‌టీలు(ఫైల్)

- నేటికీ రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వని ఐటీడీఏ అధికారులు
- ఆందోళన చెందుతున్న ఒప్పంద ఆశ్రమ ఉపాధ్యాయులు

సాక్షి, పార్వతీపురం మన్యం: ఐటీడీఏల ఆధ్వర్యంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు(సీఆర్‌టీలు) తమ ఉద్యోగ భద్రతపై ఆందోళన చెందుతున్నారు. నేటికీ రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో భవిష్యత్తుపై ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రంలో 1,284 మంది సీఆర్‌టీలు విధులు నిర్వహిస్తుండగా..పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 206 మంది, సీతంపేట ఐటీడీఏలో 250 మంది ఉన్నారు. వారికి ఏటా విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలన్నర రోజులు దాటుతున్నా..ఇంకా తమకు ఎటువంటి ఉత్తర్వులూ ఇవ్వలేదని పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని సీఆర్‌టీలు కొద్దిరోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి సీఆర్‌టీలతోపాటు, భాషా వలంటీర్లు కలెక్టరేట్‌కు చేరుకుని బైఠాయించారు.

గిరిజన పిల్లలకు మెరుగైన విద్య అందిస్తూ..

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో దాదాపు 15 ఏళ్లకు పైగా వీరు ఒప్పంద ప్రాతిపదికన స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, లాంగ్వేజ్ పండిట్‌లు, పీఈటీలుగా పని చేస్తున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో పిల్లలకు మెరుగైన విద్య అందించడంలో వీరి పాత్ర కీలకం. టైం స్కేల్ కిందే వీరికి జీతాలు అందుతాయి. గత ప్రభుత్వ హయాంలో 133 మందికి రెగ్యులర్ ఉపాధ్యాయులుగా అవకాశం లభించింది. ప్రస్తుతం ఉన్నవారికి ఈ ఏడాది ఇంకా రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఇటీవల కొంతమందికి కౌన్సెలింగ్ నిర్వహించినా, పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వలేదు. మరో 45 మందికి కౌన్సెలింగ్ కూడా నిర్వహించలేదు. దీంతో వారు తమ విద్యాసంస్థలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌కు బదిలీ అయ్యింది. ఇంకా కొత్త పీవో బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. ఆయన వచ్చి, మళ్లీ అంతా తెలుసుకునేసరికి తమ రెన్యువల్ వ్యవహారం మరింత జాప్యమయ్యే పరిస్థితి ఉంటుందని సీఆర్‌టీలు వాపోతున్నారు.

తక్షణమే రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వాలి

విద్యాసంవత్సరం ప్రారంభమైనా మాకింకా రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో సీఆర్‌టీలమతా ఉద్యోగ భద్రతపై ఆందోళన చెందుతున్నాం. ఈ ఏడాది కొంతమందికి కౌన్సెలింగ్ నిర్వహించినా ఇప్పటికీ జాయినింగ్ ఆర్డర్లు ఇవ్వలేదు. మరికొంతమందికి కౌన్సెలింగే నిర్వహించలేదు. రాష్ట్రంలో ఎక్కడా ఈ పరిస్థితి లేదు. ఇక్కడే ఇబ్బంది పెడుతున్నారు.
– ఆరిక వెంకటరావు, సీఆర్‌టీల సంఘం అధ్యక్షుడు

ఐటీడీఏ ఆవరణలో రిలే నిరాహారదీక్ష



ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరాహారదీక్షలు చేస్తున్న సీఆర్‌టీలు

పార్వతీపురం: గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో పనిచేస్తున్న సీఆర్‌టీలను తక్షణం రెన్యువల్ చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గిరిజన సంఘం నాయకులు భగవాన్, పి.సురేష్‌కుమార్‌లు మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రతి ఏటా సీఆర్‌టీలను రెన్యువల్ చేసేవారన్నారు. ఈ ఏడాది ఇంతవరకు పూర్తి స్థాయిలో రెన్యువల్ చేయకుండా సీఆర్‌టీలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. సీఆర్టీలను విధులలోకి తీసుకునేంతవరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అధికారుల చర్యలతో సీఆర్‌టీలకు ఉద్యోగ భద్రత లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఆర్‌టీల సంఘం అధ్యక్షుడు ఆరిక వెంకటరావుతో పాటు గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, కురుపాం, సాలూరు, మక్కువ మండలాలకు చెందిన సీఆర్‌టీలు త్రినాథరావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఉదయం తమ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు పట్టించుకోలేదని ఐటీడీఏ కార్యాలయం ప్రాంగణంలో సీఆర్‌టీలు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ సమాచారం మేరకు స్థానిక పోలీసులు వచ్చి సీఆర్‌టీలను శాంతింపజేశారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌ఓ కె.విజయపార్వతి



ఆశ్రమ పాఠశాలలో సిక్ రిజిస్టర్‌లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కె.విజయపార్వతి

పార్వతీపురం టౌన్: విద్యార్థులు సీజనల్ జ్వరాలకు గురికాకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి డాక్టర్ కె.విజయపార్వతి ఆదేశించారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని రావికోన, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య సమస్యల నమోదు రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ మధ్య కాలంలో జ్వర లక్షణాలతో ఎంత మంది ఉన్నారు? వారికి నిర్వహించిన పరీక్షలు, అందజేసిన చికిత్స ఎవరైనా ఉన్నత ఆస్పత్రిలో చికిత్స పొందారా? తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. జ్వరం నయమయ్యే వరకు వసతిగృహ సిబ్బంది, వైద్య సిబ్బంది పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. విద్యార్థులకు వైద్య సిబ్బంది మలేరియా నిర్ధారణ పరీక్షలు చేసి నెగెటివ్ వచ్చిన వారికి తగు మందులు అందజేశారు. సిక్ రూమ్ నిర్వహణ సక్రమంగా ఉండాలని వార్డెన్‌కు సూచించారు. విద్యార్థులతో డీఎంహెచ్‌ఓ విజయపార్వతి మాట్లాడి చేతుల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు, వైద్యాధికారులు అనూష, ధరణి, ప్రిన్సిపాల్ సింహాచలం, వైద్యసిబ్బంది శంకర్, ఉష, ఊర్మిళ, బంగారు నాయుడు, హాస్టల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

రూ.10లక్షల వరకు ముద్ర లోన్

- చిన్నయూనిట్‌ల ఏర్పాటుకు ప్రాధాన్యం
- మెప్మా పీడీ సుధాకర్ రావ్



విలేకరులతో మాట్లాడుతున్న మెప్మా పీడీ సుధాకర్‌రావ్

బొబ్బిలిరూరల్: చిరు వ్యాపారాలు చేసుకునేందుకు రూ.50వేల నుంచి రూ.10లక్షల వరకు బ్యాంకు లింకేజీ రుణాలను అందిస్తున్నట్లు మెప్మా పీడీ డి.సుధాకర్‌రావ్ చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రూ.10లక్షల వ్యయం దాటిన వారికి చిన్నపరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పీఎంఈజీఎస్‌వై పథకం ద్వారా చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటుకు రుణాలను 33శాతం సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. పొదుపుసంఘాల జీవనభృతికి ఆదాయవనరులను సమకూర్చుకునేందుకు వ్యక్తిగతంగా రెండు లక్షల వరకు, సంఘంగా రూ.50లక్షల వరకు రుణాలిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వాటిని స్లమ్ లెవెల్ ఫెడరేషన్, టౌన్‌లెవెల్ ఫెడరేషన్‌గా విభజించి రుణసౌకర్యం కల్పిస్తామని, ఆదాయం జీవనోపాధికి ఇవి తోడ్పడతాయన్నారు. 5వేల పొదుపు సంఘాలకు గతేడాది రూ.395కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలివ్వగా ఈఏడాది 4,600 సంఘాల గాను 2,854 గ్రూపులు రుణఅర్హత సాధించాయని వాటికి రూ.114కోట్లు రుణాలుగా ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.సూక్ష్మ ఆర్థిక ప్రణాళిక, వ్యక్తిగత ఆదాయభృతి పద్ధతిన రుణాలను విరివిగా అందించాలని బ్యాంకర్లకు సూచించామని తెలిపారు. పీఎం శ్రీనిధి కింద 14,491 మంది అర్హులను గుర్తించి రూ.3 కోట్ల రుణాలు అందజేశామని చెప్పారు. రూ.100 కోట్లు కార్పస్‌ఫండ్ ఉందని, రూ.250 కోట్లు బ్యాంకులింకేజీ రుణాలను 8,200 సంఘాలలోని 86వేలమంది అందజేశామని వివరించారు. 97శాతం రుణాల రికవరీ ఉండగా 3శాతం పెండింగ్‌లో ఉందని నూరుశాతం పూర్తి రికవరీ సాధిస్తామని వివరించారు.

వంద రోజుల లక్ష్యాలు సాధించాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: గృహ నిర్మాణంలో వంద రోజుల లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ సంస్థ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక వనరులు ఉపయోగించి గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఆదేశించారు. వన్ ధన్ వికాస్ కేంద్రాలు (వీడీవీకె), లేదా స్థానికుల ద్వారా ఇటుకల తయారీ అక్కడనే చేయడం తదితర అంశాలను పరిశీలించాలని పేర్కొన్నారు. సామగ్రి సరఫరా చేసేందుకు అవసరం మేరకు సహాయ సహకారాలు అందజేయడానికి ప్రయత్నించాలన్నారు. పీఎం జన్ మాన్ కింద మంజూరు చేసిన 2375 గృహాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సచివాలయం సిబ్బందిని అవసరం మేరకు వినియోగించుకోవాలని, సొంత స్థలాల్లో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు నిర్మాణం వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

అనుమతులు లేని వాటర్ ప్లాంట్లే ఎక్కువ

- జిల్లా వ్యాప్తంగా అధికారుల తనిఖీల్లో నిర్ధారణ
- అనుమతులున్నవి 17 మాత్రమే
- ట్రస్టుల పేరుతో జోరుగా నీటి విక్రయాలు



గుర్ల మండలం జమ్మిలోని వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

విజయనగరం అర్బన్: జిల్లా ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించేందుకు కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా అనధికారిక ఆర్వో వాటర్ ప్లాంట్లపై దృష్టి సారించారు. జిల్లాలో అన్ని వాటర్ ప్లాంట్లను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వాటర్ ప్లాంట్లను తహసీల్దార్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తనిఖీ చేశారు. పట్టణ ప్రాంతాల్లో కమిషనర్ల ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. బుధవారం నాటికి అన్ని ప్లాంట్లను తనిఖీ చేసి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించడంతో అధికార యంత్రాంగం దీనిలో నిమగ్నమైంది. జిల్లాలో బ్యూరోఆఫ్ ఇండియన్ స్టాండర్డ్, ఫుడ్ సేఫ్టీ వారి నుంచి అనుమతి పొందిన ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్‌ప్లాంట్లు కేవలం 17 మాత్రమే ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. సుమారు 63 ప్లాంట్లు ఎటువంటి అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వీటిపై చర్యలకు అధికారులు ఉపక్రమించారు. అనుమతి లేని ప్లాంట్ల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ట్రస్టుల పేరుతో చాలాచోట్ల వాటర్ ప్లాంటు నిర్వహిస్తున్నారు. వీరు 20 లీటర్ల క్యాన్లతో తాగునీటిని విక్రయిస్తున్నారు. ఇంటింటికి కూడా ఈ క్యాన్‌లలో నీటిని సరఫరా చేస్తున్నారు. ఇలా లక్షల రూపాయల నీటి వ్యాపారం జరుగుతోంది. ఇలాంటి వాటిని గుర్తిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మొత్తం 31 వాటర్ ప్లాంట్లను తనిఖీ చేయగా వీటిలో 4 ప్లాంట్లకు మాత్రమే అనుమతి ఉన్నట్టు తేలింది. అనుమతులు లేని వాటిని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. నీటి విక్రయాలు నిలిపివేయాలంటూ ప్లాంట్ల యజమానులకు నోటీసులు ఇచ్చారు.

కొత్తవలస మండలంలో మొత్తం 12 ఆర్వో ప్లాంట్లను తనిఖీ చేయగా వాటిలో 9 ప్లాంట్లకు అనుమతులు లేవని తేలింది. బొండపల్లి మండలంలో పది వాటర్ ప్లాంట్లను తనిఖీ చేసి అన్నింటికీ కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు.

సురక్షిత నీటినే సరఫరా చేయాలి



ఆర్వో ప్లాంట్ల ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీరు మాత్రమే అందించాలి. ప్లాంటుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు తప్పనిసరి. అనుమతులు లేని ఆర్వో ప్లాంట్లను మూసివేయిస్తాం.
– బీఆర్ అంబేద్కర్, కలెక్టర్

బ్యాడ్మింటన్ పోటీల్లో వీసీబీఏ సత్తా



సాధించిన పతకాలతో వీసీబీఏ క్రీడాకారులు, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు

- 28 పతకాలు దక్కించుకున్న క్రీడాకారులు

విజయనగరం: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విజయనగరం సిటీ షటిల్ బ్యాడ్మింటన్ అకాడమీ(వీసీబీఏ)కి చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. నగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు వివిధ వయస్సుల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో బాలుర క్రీడాకారులు 14 పతకాలు, బాలికలు 12 పతకాలు, మెన్స్ విభాగంలో 1 పతకం, ఉమెన్స్ విభాగంలో 1 పతకం కలిసి మొత్తంగా 28 పతకాలు కైవసం చేసుకున్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను విజయనగరం సిటీ షటిల్ బ్యాడ్మింటన్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ ప్రసాద్, కార్యదర్శి నున్న సురేష్‌లు మంగళవారం ఉదయం అభినందించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు డాక్టర్ కేపీ నాయుడు, కార్యదర్శి నున్నా సురేష్‌లను డాక్టర్ వీఎస్ ప్రసాద్, ఎంకేబీ శ్రీను, ఎస్.మల్లికార్జున రావు ఇతర సభ్యులు సన్మానించారు. అనంతరం క్రీడాకారులను అభినందిస్తూ వారికి మంచి శిక్షణ ఇచ్చిన కోచ్ జి శ్రీనివాసరావును అభినందిస్తూ త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు మరింతగా శిక్షణ ఇచ్చి జాతీయస్థాయి క్రీడాకారులుగా తయారు చేయాలని కోరారు.

పొదుపుసంఘాలకు రూ.120కోట్ల రుణాలు

- డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి
- మార్ట్స్ ఏర్పాటుకు స్థలపరిశీలన



విలేకరులతో మాట్లాడుతున్న పీడీ కల్యాణ చక్రవర్తి

బొబ్బిలి రూరల్: జిల్లాలో మహిళా పొదుపుసంఘాలకు ఇప్పటివరకు రూ.120కోట్లు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలుగా అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఆయన బొబ్బిలి ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 40,500 పొదుపు సంఘాలుండగా 29,180 సంఘాలు రుణ అర్హత కలిగినవిగా గుర్తించామని తెలిపారు. వారికి బ్యాంకులింకేజీ రుణాలకింద రూ.1,353 కోట్ల రుణాలను ఇచ్చేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. అలాగే శ్రీనిధి కింద రూ.160కోట్లు రుణ లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.39.4కోట్లు అందజేశామన్నారు. బ్యాంకుల్లో పొదుపుసంఘాల సొమ్ము రూ.600కోట్లు ఉన్నట్లు తెలిపారు. ఆ మొత్తానికి బ్యాంకర్లు తక్కువ వడ్డీ చెల్లిస్తున్నందున తమ శాఖ ద్వారా ఇతర అవసరాలకు వినియోగించి ఎక్కువ వడ్డీని చెల్లించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. పొదుపు సంఘాల సభ్యులు చెల్లిస్తున్న రుణాలను క్యాష్‌లెస్ చెల్లింపులు జరిగేలా పేటీఎం మెషీన్‌లను అందించామని, మధ్యవర్తుల ప్రమేయం, లంచాలు లేకుండా ఈ పద్ధతిని ప్రవేశపెట్టగా మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. అలాగే జిల్లాలో 5 మార్టులకు ప్రతిపాదించగా ప్రస్తుతం 2మార్టులను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్.కోట మార్ట్ టర్నోవర్ రూ.2.4కోట్లు కాగా గరివిడి మార్టు రూ.3.5కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్నాయన్నారు.జిల్లాలో మరో 3మార్టుల ఏర్పాటుకు స్థలపరిశీలన చేస్తున్నామని వివరించారు. శ్రీనిధి పథకం కింద లక్షవరకు రుణాలిస్తుండగా వ్యక్తిగత రుణాలను రూ.5లక్షల వరకు పెంచామని,కుటీర పరిశ్రమలకు కూడా ఇది వర్తిస్తుందని స్పష్టం చేశారు.

ప్రైవేట్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ



శిక్షణకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న జేడీఎం మార్టిన్

రాజాం: పలు ప్రైవేట్ ఉద్యోగాలకు సంబంధించి నిరుద్యోగ పురుష అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని వెలుగు జేడీఎం డి.మార్టిన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాజాం మండల సమాఖ్య కార్యాలయంలో ఎ.సి ఎ.చిరంజీవితో కలిసి ఏపీఎంలతో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 24 సంవత్సరాల లోపు నిరుద్యోగ పురుష అభ్యర్థులకు సేల్స్ సూపర్‌వైజర్, ప్రొడక్షన్ కెమిస్ట్, జూనియర్ స్టోర్‌కీపర్, సెక్యూరిటీ ఆఫీసర్ వంటి ప్రైవేట్ ఉద్యోగాలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. విజయనగరంలోని టీటీడీసీ కార్యాలయంలో సెంచూరియన్ యూనివర్సిటీ సమన్వయంతో ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ కల్పన ఉంటుందని భరోసా ఇచ్చారు. విద్యార్హతల ఆధారంగా ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, తెర్లాం మండలాల్లోని సమాఖ్యలను ఈనెల 25వ తేదీ లోగా సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు, బ్యాంకు లింకేజీ డీపీఎం రాజ్‌కుమార్, డీపీఎం బి.రవికుమార్, శ్రీనిధి మేనేజర్ సుధాకర్, రాజాం, రేగిడి, సంతకవిటి, వంగర, తెర్లాం మండలాలకు చెందిన ఏపీఎంలు ఎన్.అప్పలనాయుడు, బి.గోవిందరావు, టి.సీతారాం, ఎం.చక్రపాణి, ఎల్‌సీ ఏపీఎం దధికుమార్, ఎస్‌వీఈపీ ఏపీఎం పి.శేషగిరి, ఎఫ్‌పీఓ ఏపీఎంలు హేమలత, మంగమ్మలు, సీసీలు పాల్గొన్నారు.

డైట్ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలి

నెల్లిమర్ల: డీఈడీ–2018 లో ఫెయిలైన ప్రభుత్వ, ప్రైవేట్ డైట్ విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించాలని డైట్ ప్రిన్సిపాల్ జి.పగడాలమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈడీ–2018 మొదటి సంవత్సరం పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల ఫీజు వచ్చేనెల 4లోగా చెల్లించాలని, ఆలస్య రుసుముతో వచ్చే నెల 20వ తేదీలోగా చెల్లించాలని పేర్కొన్నారు. అలాగే ఒకసబ్జెక్టుకు రూ.100, రెండు సబ్జెక్టులకు రూ.120, మూడు సబ్జెక్టులకు రూ.140, నాలుగు సబ్జెక్టులకు రూ.150 పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు.

ఆర్టీసీ కింద పడి వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: జిల్లాకేంద్రంలో ఎత్తు బ్రిడ్జి సమీపంలో మంగళవారం ఆర్టీసీ బస్సు కింద పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వన్‌టౌన్ ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జేఎన్‌టీయూ సమీపంలో నివాసం ఉంటున్న శ్రీనివాసరావు (50) మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం గంటస్తంభం వద్ద ఉన్న కూలీలతో మాట్లాడి పని బెత్తాయించి తిరిగి సైకిల్‌పై కలెక్టరేట్ వైపు వెళ్లడానికి వస్తూ ఎత్తుబ్రిడ్జి వద్దకు వచ్చేసరికి విజయనగరం నుంచి పార్వతీపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు పక్కనుంచి వెళ్లింది. దీంతో బస్సు వెనుక భాగం తగిలి వెనుక చక్రాల కింద పడి తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.

ఏడు వాటర్ ప్లాంట్ల సీజ్

తెర్లాం: ఎటువంటి అనుమతులు లేకుండా ఇంతవరకు యథేచ్ఛగా మినరల్ వాటర్ విక్రయిస్తున్న ఏడు వాటర్ ప్లాంట్‌లను రెవెన్యూ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. దీనికి సంబంధించి తెర్లాం తహసీల్దార్ రాజ్యలక్ష్మి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన ఆదేశాల మేరకు తహసీల్దార్ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు, వీఆర్వోలు మండలంలోని మినరల్ వాటర్ ప్లాంట్‌లపై సోమ, మంగళవారాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మండలంలో 8 మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఉన్నట్లు గుర్తించారు. ఏయే గ్రామాల్లో వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయో, ఆ గ్రామాలకు వెళ్లి వాటర్ ప్లాంట్ల నిర్వహణకు అనుమతి (లైసెన్స్) ఉందా? లేదా? అని యజమానులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తెర్లాంలో ఉన్న ఒక్క మినరల్ వాటర్ ప్లాంట్‌కు మినహా మండలంలో మిగిలిన 7 వాటర్ ప్లాంట్లకు అనుమతులు లేవని రెవెన్యూ అధికారులు గుర్తించారు. అనుమతి లేని వాటర్ ప్లాంట్లను సంబంధిత నిర్వాహకుల సమక్షంలో సీజ్ చేశారు. ఇదే విషయాన్ని తనిఖీ అధికారులు తహసీల్దార్‌కు తెలియజేశారు.

వ్యక్తి ఆత్మహత్య

బొబ్బిలి: పట్టణంలోని అభ్యుదయ హైస్కూల్‌లో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పెరుగు వెంకటరమణ(61) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనపై ఏఎస్సై గొడు భాస్కర రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని బెస్త వీధికి చెందిన వెంకట రమణ తన కుమార్తె గాయత్రికి ఇటీవల అప్పులు చేసి వివాహం చేశారు. రుణదాతల ఒత్తిడి ఎక్కువవడంతో తట్టుకోలేక మంగళవారం ఉదయం తన ఇంటిలో క్రిమి సంహారక మందు తాగారు.అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన వెంకటరమణను కుటుంబ సభ్యులు గమనించి బొబ్బిలి ఆస్పత్రికి తరలించగా వైద్యసిబ్బంది చికిత్స అందజేశారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందారు.

మృతుడికి ఎయిర్ ఫోర్స్ ఉద్యోగిగా బెంగుళూరులో విధులు నిర్వహిస్తున్న కుమారుడు సాయితేజ ఇటీవల కొద్ది రోజులుగా ఇంట్లోనే ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై భాస్కర రావు తెలిపారు.